క్లుప్తంగా

పోలీసులకు ప్రశంసాపత్రాలు



మాచారెడ్డి: మాచారెడ్డి ఎస్సై అనిల్‌కు గురువారం జిల్లా ఎస్పీ సింధుశర్మ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. నెలవారీ సమీక్షలో భాగంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబర్చినందుకు ఎస్పీ ప్రశంసించారు.

బిచ్కుంద కానిస్టేబుల్‌కు..



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహ్మద్ నదీమ్ గురువారం కామారెడ్డిలో ఎస్పీ సింధు శర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆరు నెలల నుంచి ప్రయాణికుల మెడలో నుంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న మహిళా దొంగను కానిస్టేబుల్ మహ్మద్ నదీమ్ చాకచక్యంగా పట్టుకున్నారు. దీంతో ఎస్పీ చేతులు మీదుగా ప్రశంసా పత్రాన్ని అందించారు. ఎస్పీ ప్రత్యేకంగా నదీమ్‌ను అభినందించారు.

రక్తదాన శిబిరం విజయవంతం



కామారెడ్డి టౌన్: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, బ్లడ్ డోనర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో 50 మందికిపైగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి రఘుకుమార్, బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, ప్రతినిధులు శివ, పుట్ట చంద్రశేఖర్, విలాస్, శ్రీకాంత్, రాజు, రవి, మహిపటేల్, కుమార్, సాయి తదితరులున్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో గురువారం హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో విజయ స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. విద్యార్థులకు పదవ తరగతి తర్వాత విద్య, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. అలాగే మండల విద్యాధికారి షౌకత్ అలీ మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలన్నారు. సంస్థ ప్రతినిధులు రజనీకాంత్‌గౌడ్, కృష్ణాకర్, సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంకాయపల్లిని సందర్శించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల జీపీ పరిధిలోని వంకాయపల్లిని గురువారం అధికారులు సందర్శించారు. 'వంకాయపల్లిలో అన్నీ సమస్యలే' అనే శీర్షికతో వార్తా కథనం 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్ అక్కడికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి నీటి సమస్యలు తెలుసుకున్నారు. వారివెంట గ్రామ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, గ్రామపెద్దలు ఉన్నారు.

ముగిసిన శివనామ సప్తాహం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సోమలింగాల గుట్టపై గల శివాలయంలో వారం రోజులుగా కొనసాగుతున్న శివనామ సప్తాహం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వార్కారీలు, భజన మండళ్లు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత అరుణతార, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న మూలమలుపులు

- హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



భవానీపేట మూలమలుపు వద్ద ఇటీవల బోల్తా పడిన భారీ వాహనం(ఫైల్)

మాచారెడ్డి: ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జైల్ సింగ్(33) ఈ నెల 3న ఉదయం భవానీపేట మూల మలుపు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి మూత్ర విసర్జన చేస్తుండగా అతి వేగంగా, అజాగ్రత్తగా కామారెడ్డి వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. కామారెడ్డి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే

ఇటీవల కామారెడ్డి పట్టణానికి చెందిన ఓ కుటుంబం వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వస్తుండగా మండలంలోని ఘన్‌పూర్ శివారులోని మూల మలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఆ కుటుంబం అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయట పడింది.

పలు ఘటనలలో..

లచ్చాపేట గ్రామానికి పెద్దమ్మల మల్లేశ్ ఏడాది క్రితం ద్విచక్ర వాహనంపై రత్నగిరిపల్లి గ్రామానికి వెళ్తుండగా ఘన్‌పూర్ మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కింద పడగా తలకు గాయమై మృతి చెందాడు. భవానీపేట, ఘన్‌పూర్ గ్రామాల మూల మలుపుల వద్ద వాహనాలు అదుపు తప్పి బోల్తాపడ్డ ఘటనలు కోకొల్లలు. అలాగే భవానీపేట మూల మలుపు వద్ద రెండేళ్ల కిందట ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి 40 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదకరంగా మారిన ఈ మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరగా చర్యలు తీసుకోవాలి..



భవానీపేట, ఘన్‌పూర్ గ్రామాల వద్ద ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. మూల మలుపుల వద్ద ఎన్నో ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు.

– ఎదపల్లి శ్రీనివాస్, గ్రామస్తుడు, ఘన్‌పూర్

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం..



ప్రమాదకరంగా మారిన మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. అలాగే రేడియం లైన్స్ వేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం. వాహనదారులు కూడా హెల్మెట్ ధరించి వాహనాలను జాగ్రత్తగా నడపాలి.

– అనిల్, ఎస్సై, మాచారెడ్డి

బాన్సువాడలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న బలగాలు

బాన్సువాడ : ఆర్ఏఎఫ్(రాపిడ్ యాక్షన్ ఫోర్స్) ఆధ్వర్యంలో గురువారం బాన్సువాడలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ మాట్లాడుతూ.. బాన్సువాడలో పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభించిన కవాతు డెయిలీ మార్కెట్, జెండా గల్లీ, పెద్ద హనుమాన్, కోటగల్లీ, ఫైర్‌స్టేషన్, పాత వీక్లీ మార్కెట్, గౌలిగూడ, తాడ్కోల్ రోడ్డు, అంబేడ్కర్‌చౌరస్తా, సంగమేశ్వర కాలనీ, హరిజనవాడ, చమాన్, బీసీ హాస్టల్ రోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు నిర్వహించారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు, మత ఘర్షణలు జరిగినప్పుడు అదుపులోకి తేవడం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ విధి. తెలంగాణలో అన్ని జిల్లాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నారని అన్నారు.

ప్రమాదం జరగకముందే పట్టించుకోరూ..



దోమకొండ: స్థానిక తహసీల్ కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఇది ఇనుప స్తంభం కావడంతో తుప్పు పట్టింది. స్తంభం కింది భాగం పూర్తిగా శిథిలమై రంధ్రం ఏర్పడింది. ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రతి నిత్యం తహసీల్ కార్యాలయ సిబ్బందితో పాటు వందలాది మంది ప్రజలు కార్యాలయం వద్దకు వస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్నా దానిని తొలగించే చర్యలు విద్యుత్ అధికారులు తీసుకోలేదు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పశువుల కొట్టంలా శ్మశానవాటిక



నిజాంసాగర్(జుక్కల్): మంగ్లూర్ శివారులోని శ్మశానవాటికను పశువుల కొట్టంలా ఉపయోగిస్తున్నారు. పల్లె ప్రగతికి పది సూత్రాలు కార్యక్రమంలో భాగంగా రూ.లక్షలు ఖర్చు చేసి శ్మశానవాటికను నిర్మించారు. అయితే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు శ్మశానవాటికలో పాడి గేదెలను కట్టేసి, పశువుల కొట్టంలా ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా శ్మశానవాటిక వద్ద గడ్డివామును ఏర్పాటు చేసి, పెంటకుప్పలు వేస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటికను ప్రయివేటు పనులకు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



శేషవాహనాన్ని ఎత్తుకున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 4 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాడ వీధుల్లో శేష వాహనంపై స్వామి వారిని ఊరేగించారు. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి –పుష్పమ్మ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పోచారం శంభూరెడ్డి దంపతులు ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. నేడు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 వరకు కొనసాగుతాయని అన్నారు.

మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలోని కాలనీలో గురువారం మురికి కాలువ నిర్మాణ పనులను గురువారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో మురికి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. బీజేపీ నాయకులు కుంట లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి, నక్క రవీందర్, రంజిత్‌గౌడ్, అల్లం ప్రవీణ్, పోసు శివ, సంతోష్‌గౌడ్, దేవరాజుగౌడ్, స్వామి, సంతోష్, హరీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి క్యాంపు

ఎల్లారెడ్డి: పట్టణంలోని భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్.. పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజూ వ్యాయామాలు చేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. సిబ్బంది వెంకటేశం, తదితరులున్నారు.

సాయి ఆలయంలో భక్తుల సందడి



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలోని షిర్డీ సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఖాగడ హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పోతారెడ్డి, బాల్‌రాజు, భక్తులు పాల్గొన్నారు.

'అద్దె ఇంట్లో ఉంటున్నా.. ఇందిరమ్మ ఇల్లు కేటాయించండి'



ఎల్లారెడ్డి: ఇల్లు లేని తనకు డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయించాలని కోరుతూ ఎల్లారెడ్డికి చెందిన బర్ల నర్సవ్వ అనే మహిళ గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసింది. 25 సంవత్సరాలుగా తాను అద్దె ఇంట్లో నివసిస్తున్నానని, సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నానని, అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేపడుతున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర డిమాండ్‌లను నెరవేర్చాలని మున్సిపల్ కార్మికులు గురువారం కోరారు. విధులను బహిష్కరించి బల్దియా కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 3 గంటల పాటు బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ .. నాలుగు నెలల క్రితం అకారణంగా తొలగించిన 12 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరిస్తామని కమిషనర్ రాజేందర్‌రెడ్డి తెలపడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నేతలు అయాజ్ బేగ్, నర్సింగ్‌రావు, రాజు, రాజనర్సు, ప్రభాకర్, వేణు తదితరులున్నారు.

కాలువ మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని కాకతీయనగర్ 35వ వార్డులో రోడ్డు నంబర్–8లో మురికికాలువను మట్టితో మూసేయడంతో ఖాళీ ప్లాట్లలోకి మురికినీరు చేరి దోమలు వస్తున్నాయని, దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. వైద్యకళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వైపు ఇళ్ల నీరంతా ఇక్కడి ఖాళీ ప్లాట్లలోకి చేరి మురికికూపంగా మారుతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. మురికికాలువను మూసేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



బీబీపేట: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఈ సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండాకాలంలో విద్యుత్ సమస్యలు ఉన్నచోట అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. అంతే కాకుండా విద్యుత్ సమస్యలు తలెత్తితే నేరుగా మరమ్మతులు చేయవద్దని, కచ్చితంగా విద్యుత్ అధికారులను సంప్రదించాలని సూచించారు. డీఈ ప్రభాకర్, ఏఈ విజయభాస్కర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు



జిల్లా కేంద్రంలో కొత్తబస్టాండ్ ముందు సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



మద్నూర్‌లో .. మాజీ ఎమ్మెల్యే అరుణతార, నాయకులు



బాన్సువాడలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించడంతో జిల్లాలో బీజేపీ సంబురాలు మిన్నంటాయి. పలు చోట్ల టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ రోజురోజుకు బలోపేతమవుతుందని అన్నారు. బీజేపీపై నమ్మకంతో ఓటు వేసినందుకు పట్టభద్రులకు ధన్యవాదాలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ మండల కేంద్రంలో..



పెద్దకొడప్‌గల్ గాంధీ చౌరస్తాలో..



రాజంపేటలో..



గోపాల్‌పేటలో..



ఎల్లారెడ్డిలో..



మోతెలో..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



సుల్తాన్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్



రామక్కపల్లిలో మార్కింగ్ వేస్తున్న అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. ప్రభుత్వ కొలతల ప్రకారంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవి రాథోడ్, తదితరులున్నారు.

రామక్కపల్లిలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అచ్చాయపల్లి జీపీ పరిధిలో గల రామక్కపల్లిలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ వేశారు. గ్రామంలో ప్రస్తుతం ఆరుగురు లబ్ధిదారుల ఇళ్లకు మార్కింగ్ వేసినట్లు ఎంపీడీవో ప్రభాకరచారి తెలిపారు. మిగిలిన ఇళ్లకు త్వరలోనే మార్కింగ్ వేస్తామని ఆయన చెప్పారు. టీఏ సత్య ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు భూపాల్‌రెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లికి చెందిన మార్వాడి బాలరాజుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అందజేశారు. బాలరాజు అనారోగ్యానికి గురై ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.37,000 మంజూరైనట్లు తెలిపారు. నేతలు అట్టెం శ్రీను, భాస్కర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నర్సరీలలో ఉన్న మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ అన్నారు. ఆయన గురువారం కృష్ణాజీవాడి నర్సరీని పరిశీలించారు. ప్రతిరోజు మొక్కలకు నీళ్లను పోసి ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. సంబంధిత అధికారులు గ్రామాలలో తిరుగుతూ తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.

బాధితులకు నగదు, వస్తువుల అందజేత



బాన్సువాడ: బీర్కూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు నగదు, వస్తువులను గురువారం మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ అందజేశారు. ఐదు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లు కాలిపోయిన ముగ్గురు బాధితులకు బియ్యం, వంట సామగ్రితో పాటు, రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. నాయకులు పోగు పాండు, పర్శ నారాయణ, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చేరుకున్న పాదయాత్రకు లింగాయత్‌లు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం గుడిమేట్ నుంచి కొలనుపాక వరకు ఈ పాదయాత్రను చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎంపీపీ బంజ విజయ, శివకుమార్, గంగాధర్, ప్రసాద్, విజయ్ కుమార్, బస్వయ్య, ప్రభులింగం తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు, పరీక్ష ప్యాడ్ల పంపిణీ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 51 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, సభ్యులు ప్రమోద్, లక్ష్మీనారాయణ, రాజు, సంతోష్, బెజగం శేఖర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ



పిట్లం(జుక్కల్): ఖంబాపూర్ గ్రామ హనుమాన్ ఆలయం వద్ద గురువారం వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపనకు గుమ్మడికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఓం ప్రకాశ్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.